# విశ్వనాథ వారి 'పాము పాట'లోని స్త్రీల నగలు

**డా. ఎం.పద్మకుమారి,** అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు,
ప్రాచ్య విద్యా పరిషత్ (సాయంత్రం) ప్రాచ్య కళాశాల, స్టేషన్ రోడ్, కామారెడ్డి – 503111.

తెలుగు సాహిత్యంలో తొలి "జ్ఞానపీఠ" అవార్డు గ్రహీత, తెలుగు సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ సాహితీకుసుమాలను, ఫలాలను అందించిన కవి కవిసామ్రాట్ విశ్వనాథం సత్యనారాయణగారు. ఈయన సెప్టెంబర్ 10, 1895లో సం॥న కృష్ణాజిల్లాలోని నందమూరు మండలంలో జన్మించారు. పార్వతమ్మ, శోభనాద్రి గార్లు విశ్వనాథ సత్యనారాయణగారి తల్లి, తండ్రి.

విశ్వనాథ సత్యనారాయణ గారికి "జ్ఞానపీఠ" అవార్డును అందించిన నవల "వేయి పడగలు", "ఏకవీర" నవల చలన చిత్రంగా వచ్చింది. వీరు రచించిన కథల్లో "పరీక్ష", "పాముపాట" ప్రముఖమైనవి. ఒక నిరుపేద విద్యార్థి అతడు చదువులో నెగ్గుకురాలేక పడే వేదన గురించిన కథ పరీక్ష. ఇక పాముపాట విషయానికి వస్తే, ఇది సంగీతాత్మక కథా రూపకము. ఇందులో చిత్రాంగద బతుకమ్మ పాటగా కూడా ప్రసిద్ధి పొందింది.

విశ్వనాథ వారి విశిష్ట రచనల్లో "పాము పాట" ఒకటి. ఇది కరినగరంగా ప్రసిద్ధమైన నేటి కరీంనగర్‌లోని 'ధర్మ పురి' క్షేత్రంలోని దీని అనే ప్రతీతి. సౌరాష్ట్రము (గుజరాత్)ను పరిపాలించిన రాజులలో రత్నాంగదుడు ప్రసిద్ధుడు. ఇతనికి 'త్రైలోక్యసుందరి' అను కుమార్తె ఉంది. విధి వక్రించి దేశాటన చేస్తున్న త్రైలోక్యసుందరిని లక్ష్మమ్మ, నాగమ్మ అనే స్త్రీలు ఓ సుందరాంగ! నీ వూరేది? నీ పేరేమి? దేశ ద్రిమ్మరిపై తిరుగుటకు కారణమేమి? నీదేశమున నీవు ధరించు సొమ్ములేవి? అని నాగమ్మ ప్రశ్నించింది. అప్పుడు త్రైలోక్యసుందరి తెల్పిన సొమ్ముల పేర్లు వాటి స్థానములు ఈ క్రింది విధంగా పేర్కొన్నది.

"రత్నాలు చెక్కిన రాగిడీ శశిపూవు
చేర్చుచెట్టులో చెన్నొందు శశి వంక
పాపట బంతీలు బవిరె మా చెవిపూవు
దుద్దులు జుమకాలు మద్దికాయలు రాళ్ళు
చిమ్మిటి బావిలీల్ చిన్నారి నీలాలు
కోసల బావిలీల్ కొప్పుల గొలుసులు
మేల్ బూటరైకము మురుగులు గొలుసులు
మురుడీలు పోచీలు ముందరిగాజులు
బాజు బొందులు మరి బాగైన కడియాలు
గొప్ప కుత్తీ గంటు కొనలేరు నడ్డిగలు
నవరత్నహారాలు నవచంద్ర హారాలు
చిలుకల తాళ్ళులు గిలుక సరిపేటలును
పులిగోరు పతకమ్ము వరహాల పేరు
మేల్మి బంగరుబ్రేరు కారాణి గుళ్ళును
మిరియాల బేరులు నల్లపూసల దండ

సంకుపూసల పేరు సన్నముత్తెపు పేర్లు
పద్మాలు దిద్దిన పట్టుతాబొందులును
సింహ మధ్యము బోలు చిన్నారి నడుమునకు
నూలు వడ్డాణమ్ము రాలవడావడ్డాణమ్ము
గంటలొడ్డాణమ్ము క్రాలు వడ్డాణమ్ము
చిలుక వడ్డాణమ్ము జారు వడ్డాణమ్ము
ఆపైన పాదములయందో నెలతలారా!
అందెలు మువ్వలు అనువైన పిల్లేళ్ళు
పాంజీరులను తొడిగి పావడాలను చెట్టి
తుమ్మకాయలు పెట్టి తోరమ్ముగానంత
నాద్దైన ముస్తాబు కంటె వాసన గలది"

అని ఉత్తమ నాయికా లక్షణములు గల అతివను మనోహరంగా వర్ణించారు. మగువకు నగల మీద మనసు పడడమనేది ఒక సహజ లక్షణం. సౌరాష్ట్ర సుదతులేగాక తెలుగు మగువలు కూడా నగలకు మక్కువ చూపకమానరు కదా! పైన పాటలో గల నగలను వాటి స్థానములకు కొంత పరిశీలిద్దామా!

**రత్నాలు చెక్కిన శశిపూవు:** నవరత్న ఖచితమైన బంగారు చంద్రవంక. ఇది స్త్రీలు పాపిటకు కుడి ప్రక్కన అలంకరించుకుంటారు

**శశివంక:** ఇది మేలిమి బంగారు చంద్రవంక రూపంలో తీర్చిన నగ, దీన్ని కొప్పున ధరిస్తారు.

**పాపిటబంతి:** దీనికే పాపిట బిళ్ల, పాపిటహారం అని పేరు. దీన్ని పాపిట్లో దండగా ధరిస్తారు. ఇది మత్యాలతోను, రత్నాలతోను, పగడాలతోను, బంగారంతో అల్లుతారు. దీనికి చివర ఒక పతకముగానే గంట వంటిదిగానీ ఉంటుంది. గుజరాతీ, మరాఠీ స్త్రీలు సౌభాగ్య వస్తువుగా భావిస్తారు.

**చెవి పూవు:** బంగారంతో తామరపూరు రేకులుగా ఉండే గుండ్రని కమ్మలు. చెవికి ధరించే కమ్మల జోడు.

**దుద్దులు:** నవరత్నాలు పొదిగిన బంగారు ఆభరణాలు. హరిస, చిలుర్, నెమలి, బాతు, జింక, మొసలి మొదలైన ఆకృతుల్లో తయారుచేసిన చెవి కమ్మలు.

**జుమకాలు:** చెవికి పెట్టుకునే కమ్మలకు వ్రేలాడునట్లు తగిలించుకునే ఆభరణాలు. ఇవి చెవుల తమ్మెలకు ధరించిన కమ్మలు లేదా దుద్దులకు సరిపోయే విధంగా వ్రేలాడునట్లు తయారుచేస్తారు. ఇవి చెవుల కమ్మలను తగిలించి ధరిస్తారు. కొన్ని చెంపసరాలుగాను ధరించవచ్చును.

**మద్దికాయలు:** ఇవి మద్దికాయలను పోలి వుండే బంగారు కమ్మలు. ఇవి చెవులకు ధరించే ఆభరణాలు.

**బాపితీలు:** చెవి పైభాగాన కుట్టిన భాగాన బంగారు తీగతో గ్రుచ్చిన ముత్యాల గుత్తి. ఇది చెవికి ఎంతో అందంగా చిన్ని గొడుగులా ఉంటుంది.

**గువ్వపోగు:** ఇది చెవి గూబ(గువ్వ)కు పెట్టుకునే సన్నని బంగారు రేకు. ఇందులో ఎర్రరాయి లేదా రత్నంతో పొదిగిన దానితో తయారు చేయించుకుంటారు. తక్కువ బరువులతో తయారుచేస్తారు. మనిషి చనిపోయినపుడు ఈ గువ్వపోగును అట్లనే ఉంచి అంత్యక్రియలు చేస్తారని ప్రతీతి.

**కొప్పు గొలుసులు:** తల వెనుక భాగాన జడకుగాని కొప్పుకుగాని ధరించే బంగారు నగ. అర్ధచంద్రాకారంగా ఉండి రెండువైపుల ముత్యాల దండలు లేదా వేరే రత్నాలతో తయారుచేసిన పేర్లు ఉంటాయి. వీటిని కొప్పుకు జడకు అలంకరించుకుంటారు.
**మేల్ బూట రైక:** స్త్రీలు ధరించే రవిక బట్ట పైన శనగపూలవంటి అల్లికలు నేసి కట్టిన రవిక. ఈ పూలనే బూటా అంటారు. ఇవి బంగారు తీగలతోను, ముత్యాలను దారంతోను అల్లుతారు. చీరకు అందాన్ని పెంచుతాయి. **మురుడీలు:** ఇది ముంజేతి కడియాలు. గాజులు ధరించిన తర్వాత చేతికి ముందు వైపున ధరించేది.
**పోచీలు:** బంగారంతో పలకలుగా తయారుచేసిన గాజులు. ఇవి మట్టి గాజుల మధ్యలో వేసుకుంటారు.
**బాజు పొందులు**: చేతికడియాలకు 'మర' వంటిది తయారుచేసిన గాజులు. ఇవి రెండుచేతులకు పెట్టుకున్న గాజులకు ఇటు ప్రక్క అటు ప్రక్క వేసుకుంటారు. చేతికి అందాన్ని పెంచుతాయి.
**నడ్డిగలు:** గాజులకు రత్నాలగుత్తులను పొదిగిన బంగారు గాజులు. ఇవి రథం రూపంలో ఉంటాయి.
**నవరత్నహారములు లేదా నవచంద్రహారములు:** తొమ్మిది రత్నములు పొదిగిన బంగారు హారములు. వీటినే తుస్స్రె అని, నాను అని రూపములు కలవు.
**సరిపేటలు:** చిలుక రూపములలో, హంసరూపంలో బంగారు జతల పేట గోటసులు. ఇవి మెడలో ధరించే హారాలు.
**పులిగోరు:** పులిగోరు ఆకారంలో తయారుచేసుకునే బంగారు పూల గోరు. దాన్ని బంగారు గొలుసులో ధరిస్తారు.
**బంగరు పేరు**: బంగారు వండ మెడలో ధరిస్తారు.
**కారాణి గుళ్ళు:** ఇవి బంగారుగుండ్లు, గుండ్రంగా గాని, పలకలుగా గాని, షట్రూపములోను, స్పటికల రూపంలోను తయారుచేసుకొని దారంతో ఘటాయించి (దొడ్డు దారంతో అల్లుకొని) పించి మెడకు కట్టుకొనే నగ.
**మిరియాల దండ**: బంగారంతో తయారు చేసిన మిరియాల ఆకృతిలో ఉండే బంగారు పూసలతో చేసిన దండ. మెడలోధరిస్తారు.
**సంకు పూసలు:** ధాన్యపు గింజల ఆకృతిలో బంగారంతో తయారుచేసిన చిలుహారం. ఇది మెడలో ధరించేనగ.
**నల్ల పూసలు:** వివాహిత స్త్రీలు సౌభాగ్యపునగగా భావించే ఒక దండ. నల్ల పూసలను బంగారు తీగలో అల్లుతారు. నల్లపూసల మధ్యలో బంగారు పూసలను చేర్చి గుచ్చుతారు. దీన్ని పుస్తెలతాడుతో పాటుగా ధరిస్తారు.
**ముత్యాల పేర్లు:** బంగారు తీగలో ముత్యాలను గుచ్చి దండగా కూర్చి హారములు తయారు చేయించుకుని ధరిస్తారు.
**పద్మాలు:** పద్మము పూవు ఆకృతిలో తయారు చేసి బంగారు బిళ్ళలు దండలు ధరిస్తారు.
**నూలు వడ్డాణము**: సన్నని దారము వంటి నూలు దారముతో తయారు చేసుకునే వడ్డాణము.
**రాళ్ళ వడ్డాణము:** నవరత్నాలు పొదిగిన నడుము వడ్డాణము. దీన్ని బంగారంలోగాని, వెండిలోగాని రత్నాలను పొదిగి తయారుచేస్తారు. దీన్ని స్త్రీలు నడుముకు ధరిస్తారు. వడ్డాణము స్త్రీల ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు చెబుతారు.
**గంటల ఒడ్డాణము:** ఇది నడుముకు ధరించే వృత్తాకారము కలిగిన పట్టీ. వెండి, బంగారముతో తయారుచేసి, దానికి చిరుగంటలు చేర్చి పేరుస్తారు. ఈ ఒడ్డాణము నడుముకు ధరించి, నడిచేటప్పుడు గంటలు చిరు సవ్వడి చేస్తాయి.

**చిలుక ఒడ్డాణము:** బంగారు చిలుకలను పొదిగిన నడుముకు ధరించే ఆభరణము.
**జీరు వడ్డాణము:** సన్నని రేఖవంటి బంగారు తీగతో పట్టీవలె ఉండే ఒక నగ. దీన్ని స్త్రీలు వడ్డాణంగా ధరిస్తారు. ఇది స్త్రీల నడుముకు బలాన్ని చేకూరుస్తుంది.
**అందెలు:** స్త్రీలు పాదాలకు ధరించే నగలు, గజ్జెలు ఇవి సన్నని సవ్వడిచేస్తూ స్త్రీల నడకకు అందాన్నిస్తాయి.
**మువ్వలు:** సన్నని గజ్జెలు పొదిగిన కాలిగజ్జెలు, స్త్రీలు రాయంచలా నడిచేటప్పుడు ఘల్లుఘల్లు మని చప్పుడు చేస్తూ నడకను తెలియజేస్తాయి. కాలికి బలాన్ని చేకూరుస్తాయి.
**పిల్లేళ్ళు:** స్త్రీలు సౌభాగ్య సూచకంగా కాలివ్రేళ్ళకు ధరించే మెట్టెలకు ప్రక్కవ్రేళ్ళకు ధరించే ఆభరణాలు. ఇది వెండిలో రకరకాల పూల ఆకారాల్లో తయారు చేస్తారు. కాలివ్రేళ్ళకు అందాన్నిస్తాయి. అంతేకాదు స్త్రీ భావోద్వేగాలను నియంత్రిస్తాయని చెప్తారు.

సౌరాష్ట్రను పరిపాలించిన రత్నాంగదుని కుమార్తె అయిన త్రైలోక్య సుందరి తాను ధరించే నగలను, వస్త్రాలను ఎంత మురిపెంగా వివరించిన తీరు ప్రతి మగువ మనసును దోచుకుంటుంది. పూర్వకాలంలో స్త్రీ మూర్తీభవించిన దేవతా స్త్రీని తలపించేవిధంగా ఉండేది అని తెలుస్తుంది. కొన్ని నగలు నేటి స్త్రీలు ధరించేవే. కొన్ని నగలు ఆకృతులు మారినా అవి ధరించే తీరు మారలేదు. స్త్రీల ఆభరణాలు, అవి తయారు చేసే లోహాలు స్త్రీకి అందాన్నేకాదు, ఆరోగ్యాన్ని కూడా పెంపొందింపజేస్తాయని వైద్యులు చెబుతారు. పై విధంగా విశ్వనాథ గారు పాము పాటలోని స్త్రీల నగల గురించి ఈ వ్యాసం తెలియజేయడం జరిగింది.

## ఆధార గ్రంథాలు


1. పాము పాట - కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ (1995)
2. వేయిపడగలు - పుస్తకం వెనుక అట్ట
3. వేయి పడగలు – పీఠిక - ఒక మాట-విశ్వనాథ పావని శాస్త్రి
4. తెలుగు సాహిత్యచరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి, ప్రతిభ ప్రచురణలు హైదరాబాద్ - 2004.
5. తెలుగు పెద్దలు - మల్లాది కృష్ణానంద - మోహన్ పబ్లికేషన్స్ - హైదరాబాద్.